క్లుప్తంగా

కేన్సర్ బాధితుడికి ఆర్థికసాయం



బాధితుడికి ఆర్థికసాయం అందిస్తున్న శ్రీను

నందిగామ: మండల కేంద్రమైన నందిగామకు చెందిన దాసరి రమేశ్ గత కొన్ని నెలలుగా కేన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తి కావడంతో వైద్య ఖర్చులకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారనే విషయం తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన కేశమోని సదర్ శ్రీనుయాదవ్ బుధవారం బాధితుడి ఇంటికి వెళ్లి రూ.16వేల నగదును అందజేశారు. నిత్యావసర సరుకులను కూడా అందజేస్తానని తెలిపారు. కార్యక్రమంలో గుండయ్య, రామచందర్, పవన్, శివాజీ, తరుణ్, గణేశ్, సాయి, జాను, శంకర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యనారాయణ స్వామి వ్రతాలు



సత్యనారాయణస్వామి వ్రతాల్లో పాల్గొన్న దంపతులు

శంకర్‌పల్లి: మండలంలోని చెందిప్ప గ్రామంలో గల బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో బుధవారం మాఘ పౌర్ణిమ సందర్భంగా సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. సుమారు 40కి పైగానే దంపతులు ఈ వ్రతాల్లో పాల్గొన్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో చెందిప్పతో పాటు చుట్టూ పక్కన గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తుల వచ్చి, స్వామివారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత

ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి

నందిగామ: ప్రతి ఒక్కరూ దైవ చింతన అలవర్చుకొని మానసిక ప్రశాంతత పొందాలని ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని దేవునిమామిడిపల్లి సంగిగుట్ట తపోవనంలో సీతారామ, ఆంజనేయస్వామివారి దేవాలయ 11వ వార్షికోత్సవాన్ని దయానంద గిరిస్వామి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు గ్రామస్తులు పెద్ద ఎత్తున హోమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రవీందర్‌యాదవ్, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఈట గణేష్, నర్సప్పగూడ మాజీ సర్పంచ్ గోవిందు అశోక్‌కుమార్, నిర్వికల్పానందస్వామి, వాస శ్రీనివాసులు, వాస వినోద్‌కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాఠశాలకు ఫ్లోర్‌మాట్స్ అందజేత

చేవెళ్ల: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని బీజేపీ యువ నాయకుడు డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కోసం బుధవారం నాయకుడు వైభవ్‌రెడ్డి ఫ్లోర్‌మాట్స్‌ను ఉపాధ్యాయులకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివితే ఉజ్వల భవిష్యత్

రిటైర్డ్ అడిషనల్ కమిషనర్ అనురాధ



కళాశాల ఇన్ హౌస్ జర్నల్ సంచికను ఆవిష్కరిస్తున్న అనురాధ, అధ్యాపకులు

షాద్‌నగర్: విద్యార్థులు లక్ష్యం, పట్టుదలతో చదివితే ఉన్నత భవిష్యత్ పొందుతారని రిటైర్డ్ అడిషనల్ కమిషనర్ అనురాధ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అనురాధ ముఖ్య అతిథిగా హాజరై కళాశాలలో ఇన్ హౌస్ జర్నల్ సంచికను ఆవిష్కరించారు. విద్యార్థులు వ్యాసాలు చదివి వినిపించగా వారిని అభినందించారు. మైక్రో బయోలజీ ల్యాబ్‌ను ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి నైపుణ్యాన్ని వెలికితీసి, ఆయా రంగాల్లో విద్యార్థులను ప్రోత్సహించడమే అధ్యాపకుల బాధ్యత అని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఓఎస్‌డీ నీరజ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలే, వైస్ ప్రిన్సిపాల్ సృజన, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ కంకర కష్టాలు!

- అసంపూర్తిగా నందిగామ–నర్సప్పగూడ రోడ్డు
- రెండేళ్లుగా వాహనదారుల నరకయాతన
- పట్టించుకోని అధికారులు



కంకరపరిచి వదిలేసిన నర్సప్పగూడ రోడ్డు

నందిగామ: కాంట్రాక్టర్ అలసత్వం.. అధికారుల నిర్లక్ష్యం కారణంగా నర్సప్పగూడ రోడ్డు పనులు అర్ధంతరంగా నిలిచిపోవడంతో గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. నిత్యం ఆ రోడ్డుపై ప్రయాణం చేస్తూ నరకయాతన పడుతున్నారు. గత బీఆర్‌ఎస్ హయాంలో అట్టహాసంగా రోడ్డు పనులు ప్రారంభించారు. తమ గ్రామానికి అద్దంలా రోడ్డు పడుతుందని గ్రామస్తులు సంబరపడ్డారు. రోడ్డు పనులు ప్రారంభించి సుమారు రెండేళ్లు గడుస్తున్నా నేటికీ పూర్తికాకపోవడంతో గ్రామస్తులకు తిప్పలు తప్పడం లేదు.

కంకరపరిచి వదిలేయడంతో..

మండల కేంద్రమైన నందిగామ నుంచి నర్సప్పగూడ వరకు 4 కిలోమీటర్ల మేర బీటీరోడ్డు వేసేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఎంఆర్‌ఆర్ నిధులు రూ.3.10కోట్లు మంజూరయ్యాయి. రెండేళ్ల క్రితం పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ నందిగామ చౌరస్తా నుంచి అంతిరెడ్డిగూడ వరకు, వాగు సమీపంలో నుంచి కొంత మేరకు సీసీరోడ్డు వేశారు. మిగతా రోడ్డులో కంకరపరిచి అలాగే వదిలేశాడు. దీంతో సుమారు రెండేళ్ల నుంచి ఆ రోడ్డు మీదుగా వెళ్లాలంటేనే గ్రామస్తులు జంకుతున్నారు. రోడ్డు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకోవాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు ఏ మాత్రం పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం ఆ రోడ్డుపై కంకరతేలి వాహనదారులకు నరకప్రాయంగా మారింది.

డబుల్ రోడ్డుకు ప్రతిపాదనలు

నందిగామ నుంచి నర్సప్పగూడ మీదుగా చేగూరు వరకు సుమారు 7 కిలో మీటర్లు ఉన్న రోడ్డును డబుల్ రోడ్డుగా ఏర్పాటు చేసేందుకు రూ.16.75 కోట్ల వ్యయంతో ఇటీవల ప్రతిపాదనలు పంపారు. కానీ పీఆర్ రోడ్డు పనులు పూర్తయితేనే డబుల్ రోడ్డుకు నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది.

టెక్నికల్ సమస్యతో ..

పంచాయతీ రాజ్ రోడ్డు(సింగిల్‌రోడ్డు)ను డబుల్ రోడ్డుగా (ఆర్‌అండ్‌బీ)గా వేయాలంటే ముందుగా ఆ రోడ్డును పీఆర్ శాఖ నుంచి ఆర్‌అండ్‌బీ శాఖలోకి మార్చాలి. ఇటీవల జెడ్పీ సమావేశంలో పంచాయతీ రాజ్ నుంచి ఆర్‌అండ్‌బీ శాఖలోకి మార్చుతూ తీర్మానం చేశారు. కానీ పనులు మాత్రం అసంపూర్తిగానే మిగిలిపోయాయి. దీంతో డబుల్ రోడ్డు పనులకు గ్రహణం పట్టినట్లయింది. వాస్తవంగా ప్రారంభించిన పనులు పూర్తయినట్లు పీఆర్ అధికారులు ధ్రువీకరించి ఆర్‌అండ్‌బీ శాఖకు సమాచారం (వర్క్ పూర్తయినట్లు) ఇవ్వాల్సి ఉంది. అలా చేస్తేనే డబుల్ రోడ్డు పనుల ప్రక్రియ ప్రారంభమవుతుంది. కానీ ఇక్కడ అలాంటి పనిచేయకుండానే డబుల్ రోడ్డు వరకు వెళ్లారు. అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ పట్టించుకోకపోవడంతో సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది.

ఎమ్మెల్యే గారు.. దయచూపండి..

అర్ధంతరంగా నిలిచిన రోడ్డు విషయమై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దయచూపాలని గ్రామస్తులు కోరుతున్నారు. డబుల్ రోడ్డు వేసేందుకు కృషి చేస్తున్నా కూడా కాంట్రాక్టర్, సంబంధిత అధికారుల పుణ్యమా అని ఎలాంటి ఫలితం లేకుండా పోయిందని ఆరోపిస్తున్నారు. తమ గ్రామానికి రాకపోకలు కొనసాగించేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, కంకర పరిచి వదిలేయడంతో వాహనదారులు నరకయాతన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి వీలైనంత త్వరగా రోడ్డు పనులు పూర్తిచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



మా గ్రామం నుంచి రాకపోకలు కొనసాగించాలంటేనే భయమేస్తోంది. ద్విచక్ర వాహనంపై వెళ్తే కంకర రోడ్డుపై ఎక్కడ జారిపడతామో అని అనుక్షణం జాగ్రత్త పడుతున్నాం. రెండేళ్ల నుంచి పనులు కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు పనులు త్వరితగతిన పూర్తిచేయాలి.

– వడ్ల అరవింద్, బీజేపీ మండల అధ్యక్షుడు

త్వరగా పూర్తి చేయిస్తాం

వీలైనంత త్వరగా బీటీ పనులు పూర్తిచేయిస్తాం. ఇప్పటికే సీసీ పనులు పూర్తయ్యాయి. బీటీ వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. బీటీ పనులు పూర్తయిన వెంటనే ఆర్‌అండ్‌బీ శాఖ వారికి ఈ రోడ్డును అప్పగించేందుకు ఉన్నతాధికారుల ఆదేశానుసారం చర్యలు తీసుకుంటాం.

– హేమంత్, పంచాయితీరాజ్ ఏఈ

రోడ్లపై చెత్త వేస్తే కఠిన చర్యలు

- మున్సిపల్ కమిషనర్ యోగేశ్
- చెత్త వేసిన దుకాణదారుడికి రూ.5వేలు జరిమానా



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ యోగేశ్

శంకర్‌పల్లి: ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఇష్టారీతిన రోడ్లపై చెత్తవేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ యోగేశ్ హెచ్చరించారు. బుధవారం ఉదయం మున్సిపాలిటీ పరిధిలో జరిగే పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. అదేవిధంగా కార్మికుల రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. పట్టణంలోని మహేశ్వరీ ధమాకా సేల్ అనే దుకాణ వ్యాపారి రోడ్డుపై చెత్త వేసిన కారణంగా రూ.5వేల జరిమానా విధించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. పారిశుద్ధ్య పనులను నిరంతరం పర్యవేక్షిస్తానని, ఎవరికైనా ఇబ్బందులు తలెత్తితే ఫిర్యాదు చేయాలన్నారు. కమిషనర్‌తో పర్యావరణాధికారి ఆనంద్, సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్‌కు వేతనం అందజేత



వలంటీర్‌కు వేతనం అందిస్తున్న రాజేశ్‌పటేల్

కొందుర్గు: మండల కేంద్రంలోని బాలికల ప్రాథమికోన్నత పాఠశాలలో వలంటీర్‌గా పనిచేస్తున్న సోనికి మాజీ వైస్ ఎంపీపీ రాజేశ్‌పటేల్ బుధవారం వేతనం అందజేశారు. నెలకు రూ.3వేల లెక్కన 9 నెలలకుగాను రూ.27వేల తన సొంత డబ్బులు ఆమెకు అందించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. తమ పాఠశాలలో సరిపడా ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడానికి తన సొంత డబ్బులతో వలంటీర్‌ను నియమించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పరమేశ్వరి, ప్రియరంజనీ, ప్రశాంతి, మౌనిక నాయకులు జగదీశ్వర్ గౌడ్, గోపాల్, రమేశ్, రాజుగౌడ్, నవీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం



మినీ స్టేడియంలో క్రీడాకారులతో మాట్లాడుతున్న అవినాశ్‌రెడ్డి

జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పట్నం అవినాశ్‌రెడ్డి

షాబాద్: గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కృషి చేస్తామని షాబాద్ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పట్నం అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పీఆర్‌ఆర్ మినీ స్టేడియంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తన తండ్రి దివంగత నేత పట్నం రాంజేందర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా ప్రతి ఏడాది జిల్లాస్థాయి క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది స్థానిక యువతకు క్రీడల్లో అవకాశం కల్పించేందుకుగాను చేవెళ్ల నియోజకవర్గ స్థాయి క్రికెట్, వాలీబాల్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 24వ తేదీన క్రీడాపోటీలు ప్రారంభిస్తామని వెల్లడించారు. క్రికెట్‌లో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి రూ.2లక్షలు, రెండో బహుమతి రూ.1లక్ష నగదుతో పాటు మొమెంటోలు అందిస్తామన్నారు. అదేవిధంగా వాలీబాల్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి రూ.30వేలు, రెండో బహుమతి రూ.15వేలు అందిస్తామని తెలిపారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి ఒక్కో మండలానికి నాలుగు టీమ్‌లను తీసుకోనున్నట్లు చెప్పారు. షాబాద్‌కు ఎక్కువ టీమ్‌లకు అవకాశం ఇస్తామని స్పష్టం చేశారు. క్రీడాకారులు తప్పనిసరిగా తమ ఆధార్ కార్డు తీసుకుని రావాలన్నారు. ఏ మండలానికి సంబంధించిన క్రీడాకారుడు ఆ మండలంలోని టీమ్‌లో మాత్రమే ఆడేందుకు అవకాశం ఉంటుందన్నారు. తప్పనిసరిగా ఆధార్‌కార్డుతో పాటు డ్రెస్‌కోడ్ ఉండాలని సూచించారు. ఈ నెల 21వ తేదీలోపు టీమ్‌లు తమ పేర్లను నమోదు చేసుకోవాలని, ఎలాంటి ఎంట్రీ ఫీజు లేదని, ఉచిత భోజన సదుపాయం కూడా కల్పించనున్నట్లు తెలిపారు. క్రీడాకారులు తమ పేర్లు నమోదు చేసుకునేందుకు 9849711579, 9949086569 నంబర్లకు సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నక్క శ్రీనివాస్‌గౌడ్, పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

అర్చకుడిపై దాడి అమానుషం

మొయినాబాద్: దైవ సేవలో నిమగ్నమైన అర్చకుడు రంగరాజన్‌పై రామరాజ్యం సైన్యం పేరుతో దుండగులు దాడి చేయడం అమానుషమని విశ్వకర్మ సంఘం మండల ప్రచార కార్యదర్శి కమర్మి శ్రీనివాస్‌చారి అన్నారు. బుధవారం విశ్వకర్మ సంఘం ప్రతినిధులు చిలుకూరులో అర్చకుడు రంగరాజన్‌ను కలిసి పరామర్శించారు. ఆయనపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దాడి చేసిన దుండగులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని.. మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహాచారి, వెంకటేశ్‌చారి, అనిల్‌చారి తదితరులు ఉన్నారు.

స్నేహితుడికి సాయం



హరిశంకర్‌కు నగదు అందిస్తున్న స్నేహితుడు ఇంద్రసేనారెడ్డి

చేవెళ్ల: మండలంలోని మల్కాపూర్ గ్రామంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2000–01లో పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులందరూ కలిసి స్నేహితుడు హరిశంకర్ కుటుంబానికి బుధవారం 1లక్ష 10వేల రూపాయల ఆర్థికసాయం అందించి మానవత్వం చాటుకున్నారు. కుమ్మెర గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి హరిశంకర్ భార్య శోభ అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ విషయం తెలుసుకున్న తోటి మిత్రులు, ఉపాధ్యాయులు ఆపదలో ఉన్న స్నేహితుడిని ఆదుకోవాలని తలా ఇంత పోగుచేసుకొని ఆర్థికసాయం అందించారు. ఈ నగదును పూర్వ విద్యార్థుల తరఫున మిత్రుడు ఇంద్రసేనారెడ్డి శోభను పరామర్శించి బాధిత కుటుంబానికి అందజేశారు. ప్రతి ఒక్కరూ ఆపదలో ఉన్న వారికి సహాయ సహకారాలు అందించాలని పేర్కొన్నారు.

శివదీక్ష మోక్షానికి మార్గం

కొందుర్గు: నియమనిష్ఠలతో శివదీక్ష నిర్వహిస్తే మోక్షం లభిస్తుందని గురుస్వామి భూపాలచారి అన్నారు. మండల కేంద్రంలోని వేణుగోపాల్ స్వగృహంలో బుధవారం గురుస్వామి భూపాలచారి ఆధ్వర్యంలో ద్వాదశ జ్యోతిర్లింగ మహాపడిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భూపాలచారి మాట్లాడుతూ.. శివపంచాక్షరి మంత్రంలో పరమేశ్వరుడు దాగి ఉంటాడన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం చేశారు. కార్యక్రమంలో శివస్వాములు యాదయ్య లింగం, హరీశ్, బుగ్గయ్య, వెంకట్‌రెడ్డి, రాంరెడ్డి, యాదగిరి, ఆంజనేయులు పాల్గొన్నారు.

జీవాల ఆరోగ్యంపై జాగ్రత్తలు అవసరం

రేగడిదోస్వాడ పశువైద్యాధికారి చంద్రశేఖర్‌రెడ్డి



పశువులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి

షాబాద్: పాడి పశువుల ఆరోగ్యం పట్ల రైతులు తగిన జాగ్రత్తలు, డాక్టర్ల సలహాలు తీసుకొని పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకోవాలని రేగడిదోస్వాడ పశువైద్యాధికారి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని బొబ్బిలిగామ గ్రామంలో పశువులకు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో గేదెలకు చూడు పరీక్షలు నిర్వహించి, దూడలకు, గేదెలకు నట్టల నివారణ మందులు తాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సకాలంలో పశువులకు వైద్యం అందిస్తే అధిక పాల దిగుబడి వస్తుందని తెలిపారు. మేలు రకం పశువుల ఎంపిక ద్వారా అధిక ఆదాయం పొందవచ్చని తెలిపారు. రైతులు వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకుంటే మంచి లాభాలు వస్తాయన్నారు. పాడి రైతులు పశుపోషణపై దృష్టి సారించి మంచి మేలురకం పశువులకు ఎంపిక చేసుకొని, నాణ్యమైన గడ్డిజాతులు, దాణ, అందించడంతో మరింత ఆర్థిక లబ్ధి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో గోపాలమిత్ర విద్యాసాగర్, వైద్య సిబ్బంది శ్రీనివాస్, సుధాకర్, రైతులు తదితరులు ఉన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



ఆలయం ఎదుట మాట్లాడుతున్న బజరంగ్ దళ్ సభ్యులు

కొత్తూరు: కొత్తూరు పట్టణ సమీపంలోని పారిశ్రామి కవాడ ప్రధాన రోడ్డులో ఉన్న హనుమాన్ ఆలయంలో చోరీకి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని బజరంగ్‌దళ్ సభ్యులు పోలీసులను కోరారు. ఇందులో భాగంగా వారు బుధవారం ఆలయంలో చోరీకి పాల్పడిన తీరును పరిశీలించారు. నిందితులు ఆలయంలోని హుండీలను ధ్వంసం చేసి అందులో ఉన్న నగదును ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. పోలీసులు వెంటనే విచారణ చేపట్టి నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరారు. ఇటీవల కాలంలో ఆలయాల్లో చోరీలు పెరగడంతో పోలీసులు రాత్రి వేళల్లో ప్రధాన ఆలయాల పరిసరాల్లో పెట్రోలింగ్ చేపట్టే విధంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బజరంగ్‌దళ్ సభ్యులు శివకుమార్‌చారి, నరేశ్‌చారి, శేఖర్‌గౌడ్, మురళీగౌడ్, సందీప్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

షాబాద్: శ్రీరామదూత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఎంతో కృషి చేస్తోందని మెడికవర్ ఆస్పత్రి వైద్యుడు అచ్యుత్‌రావు పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని హైతాబాద్ గ్రామంలో ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 1200 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం రోగులకు ఉచితంగా అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు కాలేశ్వర్‌రెడ్డి, బాలకృష్ణ, సురేశ్, వైద్య సిబ్బంది, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.



షాబాద్: హైతాబాద్‌లో గ్రామస్తులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

కనకమామిడిలో..

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని కనకమామిడి గ్రామంలో అయాన్ మెడికల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రత్నం, అయాన్ మెడికల్ ఆస్పత్రి వైద్యులు సిద్దిఖ్, డాక్టర్ అబ్దుల్లా హుస్సేన్, స్వాతి పాల్గొన్నారు.

రాబోయేది కేసీఆర్ ప్రభుత్వమే



మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎన్మెపల్లి గ్రామస్తులు

బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి

మొయినాబాద్‌రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు చరమగీతం పాడుతూ బీఆర్‌ఎస్ వైపు మొగ్గు చూపుతున్నారని బీఆర్‌ఎస్ మండల నూతన అధ్యక్షుడు దారెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి సమీపంలో గల పావనీ రిసార్ట్స్‌లో ఎన్కెపల్లి గ్రామానికి చెందిన సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ రాము, గ్రామ అధ్యక్షుడు పెండ్యాల శ్రీనివాస్, నాయకులు సుభాష్, సత్యనారాయణ, గ్రామస్తులు కలిసి వెంకట్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. అందరం కలిసికట్టుగా గ్రామస్థాయి నుంచి బీఆర్‌ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేద్దామన్నారు. గ్రామాల్లో ఇప్పటికే కాంగ్రెస్‌పై ప్రజలు విమర్శలు చేస్తున్నారని తెలియజేశారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో పాటు ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పరిహారం అందించేవరకు పోరాటం

భూనిర్వాసితుల సంఘం మండల అధ్యక్షుడు ఆంజనేయులు



ధర్నా చౌక్ వద్ద రైతులతో కలిసి ధర్నా చేస్తున్న ఆంజనేయులు

షాబాద్: చందనవెల్లి భూనిర్వాసితులకు వెంటనే నష్టపరిహారం చెల్లించకుంటే అసెంబ్లీ ముట్టడిస్తామని భూ నిర్వాసితుల సంఘం మండల అధ్యక్షుడు నీరటి ఆంజనేయులు పేర్కొన్నారు. బుధవారం నగరంలోని ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద మండల పరిధిలోని చందనవెల్లి, మాచన్‌పల్లి, హైతాబాద్, సీతారాంపూర్‌తో పాటు తెలంగాణలోని వివిధ గ్రామాల నుంచి నష్టపోయిన రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించే వరకు తమ పోరాటం ఆగదన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కొని, అసలైన రైతులకు నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెంటనే భూ నిర్వాసితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చి, 14 నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు న్యాయం జరగలేదని వాపోయారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం భూనిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న భూనిర్వాసితులందరం కలిసి అసెంబ్లీ ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సోషలిస్టు పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు సుభద్రరెడ్డి, సంఘం ఉపాధ్యక్షులు రెడ్డయ్య, నర్సింహులు, రైతులు తదితరులు ఉన్నారు.

యాదయ్య కుటుంబాన్ని ఆదుకోవాలి

జీపీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి



యాదయ్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నాయకులు

షాద్‌నగర్: గ్రామ పంచాయతీ వర్కర్‌గా విధులు నిర్వహిస్తూ వీధి దీపాలు వేస్తున్న క్రమంలో కరెంట్ స్తంభంపై నుంచి ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందిన తుప్పరి యాదయ్య కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని జీపీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. ఫరూఖ్‌నగర్ మండలం వెలిజర్ల జీపీ కార్మికుడుగా పనిచేస్తున్న యాదయ్య ఆరునెలల క్రితం స్తంభంపై నుంచి కిందపడి గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న నర్సింహారెడ్డి బుధవారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రమాదం బారినపడి ఆరు నెలలుగా మంచానికే పరిమితమైతే అతడిని పట్టించుకున్న నాథుడేలేడని విమర్శించారు. అధికారులు స్పందించి యాదయ్య కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగయ్య పాల్గొన్నారు.